సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 28 । జూన్ । 2023



హక్కుల ఉల్లంఘనే..

బాల్యవివాహాల్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అవగాహన కల్పించడంతో పాటు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశాలు జారీచేసింది. 8లో ▸



ఉండిలో దొంగల హల్‌చల్

ఉండిలో దొంగలు రెచ్చిపోయారు. మూడు దుకాణాల్లో నగదు, బంగారం అపహరించగా, మరో నాలుగు దుకాణాల్లో చోరీకి విఫలయత్నం చేశారు. 8లో ▸



గంజాయి కేసులపై దృష్టి పెట్టండి

గంజాయి అక్రమ రవాణా, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఫ్యాక్టరీల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



తణుకులో తనిఖీలు చేస్తున్న సిబ్బంది

తణుకు: తణుకు పరిసర ప్రాంతాల్లోని పలు కర్మాగారాల్లో ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రా సుగర్స్, వాన్‌బరీ, ఫ్లూటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లు తనిఖీ చేసిన అధికారులు సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ జిల్లా అధికారి ఏటీవీ రవికుమార్, ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, తణుకు ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి, ఆంధ్రా సుగర్స్ డిస్టిలరీ అధికారి సీహెచ్ లక్ష్మి, ఎస్సై టి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 83 శాతం హాజరు

సాక్షి, భీమవరం: జిల్లాలో మంగళవారం నిర్వహించిన టెన్త్, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 83 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, జీవశాస్త్రం, వ్యాపార, వాణిజ్య శాస్త్రాల పరీక్షలకు 322 మంది హాజరుకావల్సివుండగా 283 మంది హాజరయ్యారన్నారు.

జూన్ 3 నుంచి టీటీసీ డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు

సాక్షి, భీమవరం: టీటీసీ డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్ పరీక్షలు వచ్చే నెల 3 నుంచి 6 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డు పరీక్షా కేంద్రానికి తీసుకుని రావాలన్నారు. ఎవరి కుట్టుమిషన్ వారే తీసుకుని రావాలని డీఈవో వివరించారు.

కేవీకేలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. సేంద్రీయ వ్యవసాయం, మిద్దె తోటల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల పెంపకంపై జూలై నుంచి సెప్టెంబర్ మధ్య 8 వారాల పాటు ఈ కోర్సులు నిర్వహిస్తున్నారు. కోర్సును ఎంపిక చేసుకుని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పేరిట రూ.1500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. చేరాలనుకునేవారికి వయసు నిబంధన లేదన్నారు. ఆసక్తి కలిగిన వారు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 8008788776 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

అమ్మఒడి.. నేడే జమ

- వరుసగా నాలుగో సంవత్సరం నేరుగా తల్లుల ఖాతాల్లోకి
- నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ. 2010.38 కోట్లు జమ
- ఏలూరు జిల్లాలో 1.72 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 1.43 లక్షల మందికి లబ్ధి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు.. ప్రతి పేదింటి నుంచి ఇంజనీర్లు, డాక్టర్లు రావాలి.. పేదింటి పిల్లల చదువు బాధ్యతను మేనమామగా నేను తీసుకుంటాను.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పేదింటి బిడ్డను స్కూళ్ళకు పంపిస్తే చాలు.. విలువలతో కూడిన చదువు చెప్పించడమే కాకుండా పంపినందుకు ప్రతి తల్లి ఖాతాకు నేరుగా నగదు జమ చేస్తామని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చాక అనేక ఇబ్బందులున్నా.. అమ్మఒడికి అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రతి ఏటా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. ఈ నాలుగేళ్ళలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రూ.2010.38 కోట్లు నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి.

ఈ ఏడాది అమ్మ ఒడి నగదు జమ కార్యక్రమం బుధవారం రాష్ట్రంలో లాంఛనంగా ప్రారంభం కానుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రతి ఏటా అమ్మ ఒడి ద్వారా సగటున రూ.500 కోట్ల నగదు జమవుతుంది. అమ్మ ఒడి ద్వారా ఉమ్మడి జిల్లాలో చదువుకునే విద్యార్థుల సంఖ్య గతంతో పోల్చితే పెరిగింది. పేదలు ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాల వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లల్ని చదువుకు దూరంగా ఉంచి పనులకు పంపేవారు. అమ్మ ఒడి అమలుతో జిల్లాలో పరిస్థితి పూర్తిగా మారింది. గ్రామంలో బడిఈడు పిల్లలు నూరు శాతం స్కూళ్ళకు వెళ్ళేలా ప్రభుత్వం చేయగలిగింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడుతో అభివృద్ధి చేసి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో 10, ఇంటర్ ఫలితాలు కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ సాధిస్తున్నారు. ఈ ఏడాది అమ్మఒడి బుధవారం నగదు జమ కానుంది. ఏలూరు జిల్లాలో 1,72,956 మంది తల్లుల ఖాతాల్లో రూ.259.43 కోట్ల నగదు జమ కానుంది. పశ్చిమగోదావరి జిల్లాలో 1,43,534 మంది తల్లుల ఖాతాల్లో రూ.215.30 కోట్లు జమ కానున్నాయి.



వరుసగా నాలుగేళ్లలో ఇలా..

- 2019-20 సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3,39,259 మంది తల్లుల ఖాతాల్లో రూ.508.89 కోట్ల జమ
- 2020-21 సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3,55,051 మంది తల్లుల ఖాతాల్లో రూ.532.57 కోట్ల జమ
- 2021-22 విద్యాసంవత్సరంలో నూతన ఏలూరు జిల్లాలో 1,84,239 మంది తల్లుల ఖాతాల్లో రూ. 276.36 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 1,45,461 మంది తల్లులు ఖాతాల్లో రూ. 218.19 కోట్లు నగదు జమ
- ప్రస్తుత విద్యా సంవత్సరం 2022-23లో ఏలూరు జిల్లాలో 1,72,956 మంది తల్లుల ఖాతాల్లో రూ. 259.43 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 1,43,534 మంది ఖాతాల్లో రూ. 215.30 కోట్లు నేడు జమ చేయనున్నారు.

ఏలూరు జిల్లాలో నేడు జమ కానున్న అమ్మఒడి నియోజకవర్గాల వారీగా

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	నగదు జమ (రూ.కోట్లలో)
చింతలపూడి	29,594	44.39
దెందులూరు	30,474	45.71
ఏలూరు	12,603	18.90
కైకలూరు	20,452	30.68
పోలవరం	30,434	45.65
ఉంగుటూరు	16,265	24.40
నూజివీడు	26,276	39.41
గోపాలపురం (ద్వారకాతిరుమల)	6,858	10.29
మొత్తం	1,72,956	259.43

పశ్చిమగోదావరి జిల్లాలో నేడు జమకానున్న అమ్మఒడి వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	నగదు జమ (రూ.కోట్లలో)
ఆచంట	20,794	31.191
భీమవరం	21,315	31.972
నర్సాపురం	17,138	25.707
తణుకు	21,814	32.721
తాడేపల్లిగూడెం	20,439	30.658
పాలకొల్లు	15,504	23.256
ఉండి	21,606	32.409
ఉంగుటూరు (గణపవరం)	4,294	7.386
మొత్తం	1,43,534	215.30

అర్హులందరికీ అమ్మ ఒడి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకాన్ని అర్హులందరికీ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే మూడు విడతలుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడికి సంబంధించిన నగదును నేరుగా జమ చేస్తున్నాం. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏలూరు జిల్లాలో రూ.259.43 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి రూ.215.30 కోట్లు జమ చేయనున్నట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది.

– ఎస్‌వీ రవిసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి

రైతు సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



తూర్పుపాలెంలో రైతు గ్రూపులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో పెనుమంట్ర మండలంలోని పాలమూరు, వెలగలేరు, కొయ్యేటిపాడు, నెగ్గిపూడి గ్రామాలకు చెందిన రైతు గ్రూపులకు రూ.37.40 లక్షల విలువైన పవర్ టిల్లర్లు పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు కావలసిన అన్ని సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని యాంత్రీకరణ ద్వారా వ్యవసాయ రంగంలో అభివృద్ధి పథం వైపు పయనించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ వెలగల వెంకటరమణ, సర్పంచ్‌లు కాకర రాజేశ్వరరావు, తమనంపూడి ముని రామకృష్ణారెడ్డి, మామిడిశెట్టి ధనలక్ష్మి, విద్య, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణుమాధవరెడ్డి, వ్యవసాయ సలహామండలి మండల కన్వీనరు కొవ్వూరి చిన్నారెడ్డి, ఎంపీటీసీలు కర్రి అనురాధ, కర్రి లక్ష్మీ, పెనుగొండ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పవన్.. మాపై పోటీకి సిద్ధమా!

- అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు
- సినిమా డైలాగులు మాని హుందాగా ప్రవర్తించాలని హితవు

పెనుగొండ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభల్లో సినిమా డైలాగులు మాని సంస్కారవంతంగా, హుందాగా ప్రవర్తించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు హితవు పలికారు. మంగళవారం తూర్పుపాలెంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల బరిలోకి రాకుండా ఉభయగోదావరి జిలాల్లో వైఎస్సార్‌సీపీని గెలవనివ్వనంటూ సినిమా డైలాగులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. పవన్ అన్ని నియోజకవర్గాల్లోనూ పోటీ చేయవచ్చన్నారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణపైనా, మంత్రి కారుమూరిపైనా.. అదేవిధంగా ఆచంటలో తనపైనా పోటీకి స్వాగతిస్తున్నానని, భీమవరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌పైనా పోటీ చేసి అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చన్నారు. 2014లో పోటీ చేయనన్నారని, 2019లో పోటీ చేశారని, ఇప్పుడు ఇంకా ఎటూ తేలలేదన్నారు. తన మీటింగ్‌కు వచ్చిన వారిపైనే నమ్మకం లేకుండా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, మీరే ఓడించారంటూ ప్రజలపై ఆగ్రహం వ్యక్తం చేయడం తగదన్నారు. గెలుపోటములను హుందాగా స్వీకరించాలన్నారు.



తూర్పుపాలెంలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పవన్‌కు ఇప్పటి వరకూ ఎలాంటి క్లారిటీ లేదని.. అసెంబ్లీకి వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరంటూ సినిమా డైలాగులు చెబుతున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఒకచోట రెండో స్థానం, ఒక చోట మూడవ స్థానంలో నిలిచారన్నారు.

కులం లేదంటూనే విడదీసేలా ప్రసంగాలు

కులం లేదంటూ కులాలను విడదీస్తున్నారని విమర్శించారు. రాజకీయాల్లో గౌరవ మర్యాదలు ఉండాలని.. తాట తీస్తానని, గుండు గీయిస్తానని వ్యాఖ్యలు చేస్తున్నారని.. గుండుపై ఎక్కువ అనుభవం ఉందా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రావాలంటే అన్ని కులాలను కలుపుకొని వెళ్లాలని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఎవరు ముఖ్యమంత్రి అయినా ఇప్పటి వరకూ అన్ని కులాలను కలుపుకొని వెళ్లారన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లి ఏ పార్టీకైనా అధికార పార్టీ చేసే పనులను ఎత్తి చూపే అధికారం ఉంటుందని, కాని అవాకులు చవాకులు పేలడం తగదన్నారు. జిల్లాలో అందరు మంత్రులు, ఎమ్మెల్యేలు పవన్‌పై పోటీకి సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీని ఓడించే సత్తా ఎవరికీ లేదన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లోనూ వైఎస్సార్‌సీపీ హవా కొనసాగుతుందన్నారు. దుష్ప్రచారం చేస్తూ విషం చిమ్మే వారికి ప్రజలే బుద్ధి చెబుతారని.. 2024 ఎన్నికల్లో విజయం సాధించి సీఎం జగన్ మరోసారి అధికారం చేపట్టడం ఖాయమని రంగనాథరాజు అన్నారు.

రీ సర్వే పనులకు రైతులు సహకరించాలి

అత్తిలి: రీ సర్వే పనులకు రైతులు సహకరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడులో రీ సర్వే పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియకు హాజరుకాని రైతులకు నోటీసులు పంపిస్తున్నారా లేదా అని రికార్డులు పరిశీలించారు. రీ సర్వే వల్ల ఉపయోగాల గురించి రైతులకు పూర్తి అవగాహన కలిగేలా వివరించారు. శివారు భూములకు సాగునీరు రావడంలేదని రైతులు కలెక్టర్‌కు విన్నవించగా.. వెంటనే స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ శాఖ అధికారులను, తహసీల్దార్‌ను సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వే రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఓఆర్ఐ మ్యాపులను పరిశీలించి.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఇంతవరకు అత్తిలి మండలంలో 14 గ్రామాలలో రీ సర్వే పనులు చేపట్టగా గుమ్మంపాడు గ్రామం రీ సర్వే పూర్తి అయిందని, మిగతా గ్రామాలలో పనులు మొదలు పెట్టామని కలెక్టర్ వివరించారు. మిగతా 13 గ్రామాలలో రీ సర్వే పనులను రైతుల భాగస్వామ్యంతో అధికారులు, సిబ్బంది పొరపాట్లకు తావులేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ఉప సర్పంచ్ తలారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే పక్కాగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న సురక్ష కార్యక్రమంలో చేపట్టిన ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న సురక్ష, గృహనిర్మాణం, మనబడి – నాడు నేడు, జగనన్నకు చెబుదాం, పంచాయతీరాజ్ భవనాలు, జాతీయ ఉపాధి హామీ పనులు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి సర్వే ఏ విధంగా చేస్తున్నారు, గ్రామాల్లో ఎన్ని కుటుంబాలకు సర్వే పూర్తి చేశారు వంటి వివరాలు ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని నమోదు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయలన్నారు. జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయం వద్ద నిర్వహించే ప్రత్యేక క్యాంపులల్లో ప్రజలు అడిగిన ధ్రువీకరణ పత్రాలు అందజేయలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ ప్రచార మాధ్యమాలు, ఫ్లెక్సీలను వినియోగించాలన్నారు. గృహ నిర్మాణం, జాతీయ ఉపాధి హామీ, మనబడి నాడు-నేడు, జగనన్నకు చెబుదాం ప్రగతిని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. లక్ష్య సాధనలో వెనుక బడిన మండలాలపై అసహనం వ్యక్తం చేస్తూ ఈ నెల చివరినాటికి ప్రగతి చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఎస్ఎస్ఏ పీఓ పి.శ్యామ్ సుందర్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి ఉయ్యాల ఆది శేషు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో అధునాతన పరీక్షలు

10 నిమిషాల్లోనే ఫలితాలు పొందే సదుపాయం

నూజివీడు: టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఏమైనా పరీక్షలు చేయించుకోవాలంటే ఎక్కడో ఉన్న మెడాల్ ల్యాబ్‌కు పరుగులు పెట్టాల్సి వచ్చేది. శాంపిల్స్ ఇచ్చినప్పటికీ రెండు రోజుల తరువాత ఇచ్చేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. ఏ పరీక్ష అయినా ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అధునాతన మెషీన్ల ద్వారా అత్యంత వేగంగా పరీక్ష ఫలితాలను అందిస్తున్నారు. ఏరియా ఆసుపత్రికి వచ్చే పేదలకు అత్యవసర వైద్యం అందించేందుకు వేగంగా టెస్ట్ రిపోర్టులు ఉండాలి. అధునాతన టెస్టింగ్ మెషీన్లు అందుబాటులో ఉన్నప్పుడే వేగంగా వైద్యం అందుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి పేదలకు వైద్యం సకాలంలో అందించేలా పలు అధునాతన మౌలిక సదుపాయాలు కల్పించారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా..

ప్రభుత్వ ఆసుపత్రులకు మౌలిక సదుపాయాలు పెంచుతూనే మరో పక్క పలు వ్యాధుల నిర్ధారణకు అత్యవసరమైన అధునాతన టెస్టింగ్ మెషీన్లను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిలో భాగంగానే స్థానిక ఏరియా ఆసుపత్రిలో అధునాతన మెషీన్లను ఏర్పాటు చేసింది. కమ్యూనిటీ ఆసుపత్రిల్లో కూడా ఇలాంటి మెషీన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో మాన్యువల్ టెస్టు చేయడం వల్ల కొంత ఆలస్యం కావడంతోపాటు, కచ్చితమైన రిపోర్టు రాక రోగుల వ్యాధి నివారణకు సమయం పట్టేది. ఇప్పుడు వివిధ రుగ్మతలకు సంబంధించి ఒకేసారి 72 శాంపిల్స్‌ని నూతనంగా ఏర్పాటు చేసిన మెషీన్ ద్వారా అందుబాటులోకి తెచ్చారు. ఆటో ఎనలైజర్ అనే లేటెస్ట్ టెస్టింగ్ మెషీన్లను ఏర్పాటు చేయడంతో రిపోర్టులను రోగులకు నిమిషాల్లో అందిస్తున్నారు. వైద్యులు ఈ రిపోర్టుల ఆధారంగా అంతే వేగంగా సేవలు అందిస్తున్నారు. ఎరిత్రోసైట్స్ సెడిమేంటేషన్ రేట్ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్స్ ఎనలైజర్, కాగులేషన్ ఎనలైజర్ తదితర అధునాతన మెషీన్‌లు అందుబాటులోకి వచ్చాయి.




నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అధునాతన ఆటో ఎనలైజర్, కాగులేషన్ ఎనలైజర్

10 నిమిషాల్లో రిపోర్టులు సిద్ధం

తాజాగా ఏర్పాటు చేసిన ఆటో ఎనలైజర్ మెషీన్ వల్ల కిడ్నీకి సంబంధించి నాలుగు రకాల పరీక్షలు, లివర్‌కు సంబంధించిన ఏడు రకాల పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్‌కు సంబంధించి ఐదు రకాల పరీక్షలు, సుగర్ తదితర మొత్తం 32 రకాల పరీక్షలకు సంబంధించిన ఫలితాలు కేవలం 10 నిమిషాల్లో సిద్ధమవుతున్నాయి. గతంలో ఇవే టెస్టులకు 20 నిమిషాల నుంచి 40 నిమిషాల వరకు సమయం పట్టేది.

వేగంగా పరీక్ష ఫలితాలు



గతంలో రిపోర్ట్‌లు ఆలస్యమయ్యేవి. ఇప్పుడు అధునాత యంత్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేస్తుండటంతో నిమిషాల వ్యవధిలో రిపోర్టులు వస్తున్నాయి. దీంతో వైద్యం సత్వరమే అందిస్తున్నాం. గతంలో టెస్టుల కోసం ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆసుపత్రిలోనే చేస్తుండటంతో రోగులకు ఎంతో మేలు జరుగుతోంది. గతంలో ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు ఉండగా, ఇప్పుడు ముగ్గురిని నియమించడంతో 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు.

– డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, నూజివీడు

ముగిసిన మొక్కజొన్న కొనుగోళ్లు

ఏలూరు(మెట్రో): రైతుల నుంచి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్న మొక్కజొన్నల కొనుగోలు ప్రక్రియ ప్రస్తుత రబీ సీజన్‌లో పూర్తయినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి 8,139 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేశామని ఆయన తెలిపారు. 884 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్నకు రూ.15.96 కోట్లు చెల్లించామని, కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.

క్లుప్తంగా

అగరుబత్తీ విక్రయాల హక్కుకు వేలం

ఏడాదికి రూ.30.63 లక్షలకు హెచ్చుపాట



ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారికి వినియోగించే పూలతో తయారు చేసిన అగరుబత్తీలను విక్రయించుకునే హక్కునకు ఆలయ అధికారులు స్వామివారి కల్యాణ మండపంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఐదేళ్ల కాలపరిమితికి జరిపిన ఈ వేలంలో మొత్తం నలుగురు పాటదారులు పాల్గొనగా, అందులో ద్వారకాతిరుమలకు చెందిన పెద్దింటి కరుణ ఏడాదికి రూ.30,63,000లకు హెచ్చుపాటను పాడారు. ప్రతి ఏటా ఈ సొమ్ముకు అదనంగా 10 శాతంతో పాటు, 18 శాతం జీఎస్టీని చెల్లించాల్సి ఉంది. అయితే గత రెండేళ్ల క్రితం నిర్వహించిన ఇదే వేలంపాటలో శ్రీవారికి ఏడాదికి రూ.2,31,000 లభించగా, ప్రస్తుత వేలంపాట ద్వారా ఏడాదికి రూ.30,63,000 ఆదాయం సమకూరనుంది. తిమ్మాపురానికి చెందిన సూరన్న రూ.24.84 లక్షలకు సీల్డ్ టెండర్, సీహెచ్ శరణ్య రూ.21,11,111లకు ఈ టెండర్ వేసినట్టు అధికారులు తెలిపారు. అయితే హెచ్చుపాటను ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాథరావు ఆమోదించాల్సి ఉంది. వేలం నిర్వహణలో ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్లు వాసు, రమణరాజు, హనుమంతు, లలితకుమారి, ఏఈ శివ పాల్గొన్నారు.

బాల్య వివాహం.. హక్కుల ఉల్లంఘనే..

- గత ఐదేళ్లలో 400 వివాహాలు
- అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- ఈ నెల 14న జీవో 31 విడుదల
- ప్రతి నెలా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో సమీక్షకు ఆదేశాలు
- సమీకృత అభివృద్ధి లక్ష్యాల్లో చేర్చడంతో రాష్ట్ర స్థాయిలో పరిశీలన



బాల్యవివాహాల కేసుల్లో కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీఓ



నూజివీడులోని బాలసదనం

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్: ఇంట్లో ఆడపిల్ల ఉంటే.. పెళ్లి చేసి అత్తారింటికి పంపించే వరకు బరువు, భారంగానే భావిస్తున్నారు పలువురు తల్లిదండ్రులు. ఒకపక్క ఆడపిల్లలు అనేక వివక్షలు, అడ్డంకులను ఎదుర్కొంటూ సమాజంలో తమకంటూ ఒక గుర్తింపును తెచ్చుకునేందుకు, ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు ప్రయత్నిస్తున్నారు. తమదైన జీవితాన్ని తామే ఎంచుకునేలా ఎదుగుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యావకాశాలను అందుకుంటూ.. పోటీ ప్రపంచంలో దీటుగా నిలుస్తున్నారు. మరోపక్క బాల్య వివాహాలతో వారిని వెనక్కి లాగే పరిస్థితులు నేటికీ మన సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. ఉన్నత స్థాయి విద్యావంతులు ఉన్న కుటుంబాల్లో సైతం ఇంకా ఇలాంటి పరిస్థితులే ఉండటం శోచనీయం. ఆడపిల్లకు వివాహ వయస్సు 18 ఏళ్లుగా రాజ్యాంగంలో పేర్కొన్న విషయం తెలిసిందే. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలు చేయడం.. బాలికల హక్కుల ఉల్లంఘన కిందకు కూడా వస్తుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు.

బాల్య వివాహాలకు కారణాలివీ...

గడచిన ఐదేళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 వరకు బాల్య వివాహాలు జరిగాయి. ఎక్కువ శాతం బాల్య వివాహాలకు ప్రధాన కారణం తల్లిదండ్రులు చదువుకోకపోవడంగా ఉంది. వారికి పెళ్లి వయసుపై సరైన అవగాహన లేకపోవడం మరో ప్రధాన కారణం. ఆడపిల్లకు త్వరగా పెళ్లి చేసి బాధ్యత నెరవేర్చుకోవడమే ప్రాధాన్యతగా తల్లిదండ్రులు భావిస్తుండటం, బంధువుల్లో మంచి సంబంధాలు దూరమవుతాయనే భయంతో త్వరపడటం మిగిలిన కారణాలుగా ఉన్నాయి. దీంతో పాటు మైనర్ బాలికలపై పలుచోట్ల జరుగుతున్న దురాగతాలు చూసి ఆందోళనకు గురై త్వరగా పెళ్లి చేయాలని భావించడం మరో కారణంగా ఉంది.

ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు..

రాష్ట్రంలో బాల్య వివాహాలను నిరోధించడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు సిద్ధమైంది. దీనిలో భాగంగా ఈ నెల 14న జీవో నంబర్ 31ని విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం జిల్లా స్థాయిలో సీఎంపీఓ (చైల్డ్ మ్యారేజ్ ప్రొబేషన్ ఆఫీసర్)గా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రతినెలా బాల్య వివాహాలపై సమీక్ష నిర్వహించి వివిధ శాఖల అధికారులకు వారు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దిశా నిర్దేశం చేస్తోంది.

చట్టాలు.. కమిటీలు ఇలా..

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా బాల్య వివాహాల నిరోధక చట్టం–2006, పిల్లల సంరక్షణ చట్టం 2015 ప్రకారం కేసులు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గ్రామ స్థాయిలో సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్, వీఆర్వో, మహిళా పోలీస్‌తో బాల్య వివాహాలను అడ్డుకునేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ బాల్య వివాహాలపై పర్యవేక్షణ చేస్తారు. ప్రతి నెలా మొదటి సోమవారం గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో బాల్య వివాహాలపై సమావేశాలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆర్డీఓలు జిల్లా స్థాయి కమిటీగా బాల్య వివాహాలపై సమీక్షిస్తున్నారు.

వివిధ కోర్సుల్లో శిక్షణ, ఉన్నత విద్యకు అవకాశాలు...

బాల్య వివాహాలపై సమాచారం తెలియగానే అధికారులు వాటికి అడ్డుకట్ట వేస్తున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. బాలికల విద్యార్హతలను బట్టి వారికి ఒకేషనల్ కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు, ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రధానంగా బాలికలను రీహ్యాబిలిటేషన్ సెంటర్లలో ఉంచి వారిని ప్రయోజకులను చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి మధ్యవర్తుల సమక్షంలో వారికి అప్పగిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 4 పునరావాస కేంద్రాలు

బాల్య వివాహాలను అడ్డుకుని ఆయా బాలికలను సంరక్షించడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు బాల సదన్‌లు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో దెందులూరు, నూజివీడు, పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు, ఆకివీడు ఉన్నాయి. బాలికలు చదువుకోవడానికి తణుకులో కళాశాల ఎట్ హోం సౌకర్యం ఉంది. వారి ఆసక్తిని బట్టి చదువు, వృత్తి, నైపుణ్య విభాగాల్లో శిక్షణ ఇచ్చి వారిని ప్రయోజకులను చేస్తున్నారు. కొన్ని కొన్ని సందర్భాల్లో బాలికల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను వారికే అప్పగిస్తున్నారు.

కష్టకాలంలో ఆదుకున్న ‘దిశ’ యాప్...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ పోలీస్‌స్టేషన్, దిశ యాప్ కారణంగా చదువుకున్న, అవగాహన ఉన్న బాలికలు బాల్య వివాహాన్ని అడ్డుకునేందుకు ‘దిశ’ను ఆశ్రయిస్తుండటం గమనార్హం. ఈ నెల ఎనిమిదో తేదీన ఏలూరు మండలం వెంకటాపురానికి చెందిన ఓ బాలిక ఇదేవిధంగా పెద్దలు పెళ్లి నిశ్చయించగా, తాను చదువుకుంటానని, తనకు పెళ్లి ఇష్టం లేదంటూ దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసిన ఉదంతమే దీనికి తాజా ఉదాహరణ. ఆమె కాల్‌తో వెంటనే స్పందించిన దిశ స్టేషన్ పోలీసులు పది నిమిషాల వ్యవధిలో బాలిక ఇంటికి చేరుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లి రద్దు చేశారు. దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేయడం ద్వారానే తనకు న్యాయం జరిగిందని ఈ సందర్భంగా సదరు బాలిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేయడం గమనార్హం.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. బాలికలు చదువుకుంటామంటే విజయవాడలోని సీడబ్ల్యూసీ కమిటీ ద్వారా హోమ్‌కు పంపించి కాలేజీలో చేర్పించడం, పని నేర్చుకుంటామంటే చేతి పనులు నేర్పించడం చేస్తున్నాం.

– గుర్రం రాగమయి, ఇన్‌చార్జి పర్యవేక్షణాధికారి, నూజివీడు

సమష్టి కృషి



జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాలను అరికట్టేందుకు సమష్టిగా కృషి చేస్తున్నాం. ఏలూరు జిల్లాలో సీఎంపీఓగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. ప్రతి నెలా వీటిపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమీక్షలు నిర్వహించడం ద్వారా అవసరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నారు. బాల్య వివాహాల కేసుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల వయసును ఆధార్ కార్డులో మార్చివేస్తున్న విషయాన్ని గుర్తించాం. స్కూల్ రికార్డుల ఆధారంగానే వయస్సు నిర్ధారణ చేస్తున్నాం.

– డాక్టర్ సూర్యచక్రవేణి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెదవేగి: న్యాయంపల్లిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన నల్లమెల్లి తంబి (30) అదే గ్రామానికి చెందిన ఓ రైతు దగ్గర కమతం ఉంటూ పొలంలోనే నివాసం ఉంటున్నాడు. సోమవారం యథావిధిగా తోటలో పనులు ముగిసిన తరువాత రైతు ఇంటికి వచ్చేశాడు. మంగళవారం ఉదయం పక్కపొలంలో పనికి వెళుతున్న కొంతమంది ఉరి వేసుకుని వేలాడుతున్న తంబిని గమనించి రైతుకు, గ్రామ పెద్దలకు చెప్పారు. అప్పటికే తంబి మృతి చెంది ఉండగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తంబి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.. మృతుని తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.

ఆలయాల్లో హుండీల చోరీ

చాట్రాయి: మండలంలోని మూడు గ్రామాల్లోని ఆలయాల్లో హుండీలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అపహరించి వాటిని పగులగొట్టి కానుకలను చోరీ చేశారు. తుమ్మగూడెం, ఆరుగొలనుపేట, జనార్దనవరంలోని ఆంజనేయస్వామి, రామాలయాల్లోని హుండీలను అపహరించారు. ఎస్సై కె.ప్రతాప్‌రెడ్డి ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

29 నుంచి రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాలలో ఈనెల 29 నుంచి జులై 2వ వరకు జాదం రామచంద్రరావు మెమోరియల్ 8వ జూనియర్ అంతర్ జిల్లాల బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల బాలబాలికల జట్లు పాల్గొంటాయన్నారు. సాయంత్రం 5 గంటలకు పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారని, ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన రాష్ట్ర జట్టు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు.

రేపు వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం : వివిధ నేరాల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 29వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు పోలవరం ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనివాస బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎస్‌ఈబీ స్టేషన్‌లో 10 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని, వివరాలకు పోలవరం ఎస్‌ఈబీ స్టేషన్‌లో గాని, 94409 02432, 94411 44332 నెంబర్లకు గాని సంప్రదించాలన్నారు.

ఉండిలో రెచ్చిపోయిన దొంగలు

- మూడు దుకాణాల్లో చోరీలు
- మరో నాలుగింటిలో విఫలయత్నం
- సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసుల విచారణ



ఉండిలో ఓ దుకాణంలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తి

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో సోమవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఏడు దుకాణాల్లో చోరీలకు తెగబడ్డ వీరు మూడు దుకాణాల్లో నగదు, బంగారం అపహరించగా, మరో నాలుగు దుకాణాల్లో చోరీకి విఫలయత్నం చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఉండి సెంటర్‌లోని వాసవి ఐరన్ హార్డ్‌వేర్, అక్షయ మానస మెడికల్స్, ధనలక్ష్మి ఐరన్ అండ్ సిమెంట్ స్టోర్, ఆర్‌కే షూమార్ట్ దుకాణాల ఐరన్ షట్టర్లను పగులగొట్టి చోరీ చేశారు. వీటిలో ఆర్‌కే షూమార్ట్‌లో రూ.2.30 లక్షలు నగదు, కాసు బంగారం, 25 తులాల వెండి, ధనలక్ష్మి ఐరన్ స్టోర్‌లో రూ.18 వేల నగదు, మెడికల్ దుకాణంలో రూ.వెయ్యి నగదు అపహరించారు. మరో నాలుగు దుకాణాల్లో షట్టర్లు తెరుచుకోకపోవడంతో దొంగలు వెనుదిరిగారు. ఆర్‌కే షూమార్ట్ యజమానురాలు చెన్నశెట్టి భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దుకాణాల్లో లభ్యమైన సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

● గడపగడపకు సంక్షేమం



ఉండి: ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

గంజాయి, పోక్సో కేసులపై దృష్టి పెట్టండి

- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్
- ఎస్పీ మేరి ప్రశాంతితో కలిసి చేబ్రోలు స్టేషన్ ఆకస్మిక తనిఖీ



చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌ను సమీక్షిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరి ప్రశాంతి

ఉంగుటూరు: గంజాయి అక్రమ రవాణా, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. చేబ్రోల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఎస్పీ మేరి ప్రశాంతితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ గంజాయి రవాణా కేసుల్లో పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని నేరస్తులను పట్టుకోవాలన్నారు. హైవేలలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మహిళలను తరలించే ముఠాలను గుర్తించాలని, పోక్సో కేసులలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళా పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని, గొడవలు ఉత్పన్నమైతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. స్టేషన్ సిబ్బంది కేసుల విచారణపై సూచనలు చేశారు. ఎస్సై స్వామి, సీఐ సుబాష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే ఎస్సీల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

సాక్షి, భీమవరం: మాలల సంక్షేమం, అభివృద్ధి పట్టని కొంతమంది ఎస్సీ నాయకులు టీడీపీకి వత్తాసు పలుకుతూ వైఎస్సార్ సీపీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళవారం భీమవరంలో నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మాలల ఆత్మీయ సమ్మేళనం పేరుతో కొంతమంది ఎస్సీ నాయకులు టీడీపీకి అనుకూలంగా మాలలంతా ఉన్నారనే విధంగా మాట్లాడటంపై మండిపడ్డారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేష్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నియాత్రలు చేసినా రాష్ట్రంలో అన్నివర్గాలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో జగన్‌కే పట్టం కడతారన్నారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి కటికతల రాజారావు, సుధామ్మ, ఎం.కిరణ్ పాల్గొన్నారు.

మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టిన చంద్రబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టిన వ్యక్తి చంద్రబాబు అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. మంగళగిరి టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరుగుతున్న మాలల ఆత్మీయ సమ్మేళనంపై మంగరాజు మాట్లాడుతూ దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని దళితులను కించపరిచిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. నిజమైన మాలలు ఎవ్వరూ వెళ్లలేదన్నారు.

శ్రీకృష్ణునిగా జగన్నాథుడు



శ్రీకృష్ణుని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణునిగా జగన్నాథుడు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామివారి ఆలయంలో జరుగుతున్న రథోత్సవాలను పురస్కరించుకుని జగన్నాథుడు ఆలయ మండపంలో రోజుకో అలంకారంలో భక్తులను సాక్షాత్కరిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లన గ్రోవితో, రుక్మిణి సమేత నీలమేఘ శ్యాముడైన శ్రీకృష్ణునిగా దర్శనమిచ్చిన జగన్నాథస్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పోలీస్ కస్టడీకి యాసిడ్ దాడి నిందితులు

ఏలూరు టౌన్: ఏలూరులో మహిళపై యాసిడ్ దాడి ఘటనలో ప్రధాన నిందితుడితోపాటు, యాసిడ్ దాడి చేసిన మరో ఇద్దరిని పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతి నిచ్చింది. ముగ్గురు నిందితులను ఏలూరు టూటౌన్ పోలీసులు మంగళవారం ఉదయం ఏలూరు జిల్లా జైలు నుంచి తీసుకువచ్చి ఏలూరు జీజీహెచ్‌లో వైద్యులతో ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఈ నెల 13న ఏలూరు విద్యానగర్ మోనాస్ట్రీ సమీపంలో నివాసం ఉంటున్న యడ్ల ఫ్రాన్సికపై యాసిడ్ దాడి జరిగింది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు బోడా నాగసతీష్, బెహర మోహన్, బూడిద ఉషాకిరణ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఇదే కేసులో యాసిడ్ విక్రయించిన మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేసేందుకు నిందితులను పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ఏలూరు దిశ పోలీసులు న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో వీరిని ఒక్కరోజు పోలీస్ కస్టడీకి అనుమతించడంతో మంగళవారం జైలు నుంచి తీసుకువచ్చారు. విచారణ అనంతరం బుధవారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా జైలుకు నిందితులను తిరిగి అప్పగించే అవకాశం ఉంది. ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో విచారణ చేయనున్నట్లు తెలిసింది.

29న ఆట్యాపాట్యా ఎంపిక పోటీలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్ ఆవరణలో ఈనెల 29న ఆట్యాపాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆట్యాపాట్యా సబ్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన రామచంద్రరాజు, జి.కిరణ్‌వర్మ చెప్పారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 2009 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రంతో పోటీలకు హాజరుకావాలని, ఇతర వివరాల కోసం 98487 90115 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆట్యాపాట్యా రాష్ట్ర పోటీలకు ఏడుగురి ఎంపిక

నూజివీడు: ఆట్యాపాట్యా అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్లు హెచ్ఎం పొట్లూరి రాధికారాణి మంగళవారం చెప్పారు. గన్నవరంలో ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో అండర్–14 బాలుర విభాగంలో గోపు విజయ్‌కుమార్, బొకినాల కిరణ్, గొట్టిపాటి మణికంఠ, అండర్–14 బాలికల విభాగంలో జయశ్రీ, అనూష, కఠారి పల్లవి, గంటా జాహ్నవి ఎంపికయ్యారన్నారు. వీరు జులై 1, 2 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా తునిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

స్వర్ణవారిగూడెంలో బాలిక కిడ్నాప్

- గంటల వ్యవధిలో కేసును ఛేదించిన పోలీసులు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): అంగన్‌వాడి కేంద్రానికి వెళ్లిన బాలికను గుర్తు తెలియని వ్యక్తి అపహరించిన ఘటనపై పోలీసులు గంటల వ్యవధిలోనే ఆ కేసును ఛేదించి బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలవరం డీఎస్పీ ఎ.శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంకు చెందిన ఐదేళ్ల బాలిక అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం వెళ్లింది. మధ్యాహ్నం ఒక గుర్తు తెలియని వ్యక్తి కేంద్రానికి వచ్చి బాలికను తీసుకువెళ్లాడు. సాయంత్రమైనా బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లి దేవిక అంగన్‌వాడీ కార్యకర్తను అడిగింది. బాలికను ఓ వ్యక్తి వచ్చి తీసుకువెళ్లాడని, తెలిసిన వ్యక్తి అని భావించి పంపినట్లు తెలిపింది. పాప జాడ లేకపోవడంతో దేవిక జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 112 కి ఫిర్యాదు చేసింది. దీంతో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో పోలవరం డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో నాలుగు పోలీస్ బృందాలు బాలిక ఆచూకీ కోసం గాలించాయి. జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై వి.చంద్రశేఖర్, బుట్టాయగూడెం ఎస్సై ఎం.జయబాబు ఆధ్వర్యంలో బృందాలు జల్లెడపట్టాయి. బాలిక తల్లి దేవికను అనుమానితుల వివరాలు అడుగగా కొయ్యలగూడెంకు చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు చెప్పింది. ఆ కోణంలో పోలీసులు విచారణ చెయ్యగా అతనే బాలికను తీసుకువెళ్లి దేవరపల్లి ఇందిరా కాలనీలో ఉంచాడన్న సమాచారంతో బాలికను తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు. దేవిక ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కాగా గంటల వ్యవధిలోనే బాలిక ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించినందుకు పోలీసులను పలువురు అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యలమంచిలి: అప్పులు ఎక్కువగా చేసి వాటిని తీర్చే మార్గం లేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మేడపాడుకు చెందిన సాకా సందీప్ (27) ఎక్కువగా అప్పులు చేసి, తీర్చే దారి తెలియక ఈ నెల 20న పురుగుమందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు, అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు సాకా సతీష్ ఫిర్యాదు మేరకు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామివారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు.

క్లుప్తంగా

మాధవరంలో 155 మందికి క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు



మాధవరంలో క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరంలో పాల్గొన్న సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరంలో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఆత్మబంధువులం సేవా సంఘం ఆధ్వర్యంలో తానా ఫౌండేషన్ సహకారంతో హైదరాబాద్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ డాక్టర్స్‌చే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు 155 మందికి నిర్వహించారు. ఆత్మబంధువులం సేవా సంఘం ఫౌండర్ శీతాల ఉషాకిరణ్, ఉపాధ్యక్షుడు టి.సూరిబాబు, పి.నాగరాజు, కేవీ చలం, సాధనాల త్రిమూర్తులు, సర్పంచ్ కొప్పుల హనుమంతరావు, పత్తి బాబీ తదితరులు పర్యవేక్షించారు. అనంతరం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.

తణుకులో ఉత్సాహంగా సాంఖ్యకోత్సవ్ 2023



తణుకు మహిళా కళాశాలలో సాంఖ్యకోత్సవం 2023ను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్

తణుకు టౌన్: తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో సాంఖ్యకోత్సవ్ 2023 మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. తణుకు మహిళా కళాశాలలో జరిగిన ఈకార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈనెల 29వ తేదీన భారత గణాంక శాస్త్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ ఉత్సవంలో వివిధ జిల్లాలకు చెందిన కళాశాల విద్యార్థులతో సాంఖ్యక శాస్త్రానికి సంబంధించిన వివిధ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కన్వీనర్ సీహెచ్ నాగరాజు, ఏ దీప్తి, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్-లారీ ఢీ



ప్రమాదంలో గాయపడిన దేవ సహాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని గొల్లగూడెం-అప్పారావుపేట రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన బైక్, లారీ ఢీ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకట్రావుపాలెంనకు చెందిన ఉసురమర్తి దేవసహాయం తాడేపల్లిగూడెం వైపు నుంచి వెంకట్రావుపాలెంనకు బైక్ మీద వెళ్తుండగా మార్గమధ్యలో గొల్లగూడెం-అప్పారావుపేట రహదారిలో అప్పారావుపేట నుంచి తాడేపల్లిగూడెం వైపునకు ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టారు. ఈ ఘటనలో దేవసహాయంనకు తీవ్ర గాయాలయ్యాయి. తలకు, కుడి కాలుకి గాయాలు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలంలో స్థానికులు వెనువెంటనే 108 కాల్ చేసి ఏరియా ఆసుపత్రికి దేవసహాయంను తరలించారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం



కళాకారులకు ఆట, పాటలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రాచీన కళలను కాపాడుకుందామని, ఆట, పాటలతో ప్రజలలో చైతన్యం తీసుకువద్దామని ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గురువుల వర్క్‌షాపులో మంగళవారం కళాకారులకు పాటలు, డప్పులు, డాన్స్, కోలాటం, నాటికల శిక్షణలో భాగంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం హిందుత్వాన్ని ముందు వేసుకొని, మనువాదంతో కులాలపైన, మతాలపైన దాడులు చేస్తూ, కార్పొరేట్లుకు, పెట్టుబడిదారులకు అండగా నిలబడుతుందని విమర్శించారు. చైతన్య ప్రసాద్, వలి, కవి, రాజు, ఖాసీం, పెద్దిరాజు, కృష్ణవేణి, కళాకారులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

భీమవరం అర్బన్ : దాతలు అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు పి.ఎలైజా దాని అన్నారు. గొల్లవానితిప్ప గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అరసవల్లి ఛారిట్రబుల్ ట్రస్టు సహకారంతో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

సాగుకు సన్నద్ధం- సార్వా పనులు ప్రారంభం



నాట్లు వేసేందుకు వీలుగా ముదునూరు గ్రామంలో ఉన్న నారుమడి



దుక్కులు చేపట్టి సిద్ధంగా ఉంచిన దృశ్యం

పెంటపాడు: డెల్టా మెట్ట ప్రాంతాల్లో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో దుక్కులు దున్నుతూ సాగుకు శ్రీకారం చుడుతున్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో పాడిపంటలు పుష్కలంగా ఉంటాయని నమ్మిన రైతులు పట్టు వదలని విక్రమార్కుడిలా ఎన్నో ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నాడు. పెంటపాడు మండలంలో24 వేల ఎకరాల్లో సార్వాసాగువుతోంది. ఇందులో సగం పంట నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తారు. మిగతా పంటకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ఈ సార్వాలో 1061, 1001, పీఎల్, 1121 డీపీటీ 5204, 1064, స్వర్ణరకాలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. గతేడాది సాగునీరు సార్వాసాగు పుష్కలంగా అందింది. పంట దిగుబడి మాత్రం పెరిగింది. దీంతో రైతులు సొంతంగా విత్తన సేకరణ చేసుకొనే పరిస్థితి ఏర్పడింది. విత్తనాలు కావాలి. వీటిలో 50 శాతం వ్యవసాయశాఖ పంపిణీ చేసే అవకాశం ఉంది. మిగిలిన విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి ధాన్యం దళారులు విత్తనాలు కొనుగోలు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

సాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

తొలకరిలో ఆశాజనకంగా ఉన్నప్పటికి నాట్లు వేసే సమయంలో వీటి ప్రభావం ఏమేరకు ఉంటుందో తెలియని స్థితి ఉంది. మెట్ట ప్రాంతాల్లో వర్షాలపై ఆధారపడతారు. నీరు పూర్తిస్థాయిలో ఉండని స్థితి ఉంది. కాగా డెల్టాలో మాత్రం కాలువలపై ఆధారపడి పంటలు పండిస్తారు. జగనన్న ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపేట వేస్తుంది. మండలంలో సాగునీటికి ఇబ్బందులు ఉండే పరిస్థితి ఇకపై ఉండదని చెబుతున్నారు. పెంటపాడు మండలంలో పలు గ్రామాల్లో నారుమడులు పూర్తయ్యాయి. నాట్లు వేసేందుకు వీలుగా చిన్న ట్రాక్టర్లతో మడులు దున్నుతున్నారు. సేంద్రియంగా సాగుచేసేందుకు వీలుగా పచ్చిరొట్ట, కుళ్లిన గడ్డిద్వారా వచ్చిన మట్టిని చేలలో వేస్తున్నారు. ఈఏడు ఎండలు ఎక్కువగా ఉండి రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో సాగు లేటయే అవకాశం ఉంది. అయితే వ్యవసాయ శాఖ అధికారులు తక్షణం నారుమడులు పూర్తిచేసుకొని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉండాలని జూలై మొదటి వారంలోగా నాట్లు వేసుకోవాలని చెబుతున్నారు.

రైతుకు అండగా భరోసా

వరిసాగు వ్యయం ఏటా గణనీయంగా పెరుగుతోంది. నారుమడుల నుంచి కోతలు పూర్తయ్యే వరకు ఎకరాకు రూ. 35 వేలు వ్యయం అవుతోంది. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వైఎస్సార్ రైతు భరోసా ఎంతగానో ఉపయోగపడుతోందని రైతులు చెబుతున్నారు.

నేడు రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 133వ నెలవారీ సభా కార్యక్రమం బుధవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఆక్వా కల్చర్ అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు వడ్డి రఘురాం నాయుడు జ్యోతి ప్రజ్వలన, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు బి.భాస్కరరావుకు గౌరవ సత్కారం, బుర్రకథ కళాకారుడు ఎస్.కృష్ణ మూర్తికి కళా సత్కారం, అధ్యాపకులు డి.శ్రీరామ చంద్రరాజుకు ఉద్యోగా సేవా పురస్కారం అందజేస్తారని, పేద కళాకారునికి ఆర్థిక సత్కారం చేస్తారని వెల్లడించారు. గాయనీ గాయకులతో ట్రాక్ సంగీత విభావరి జరుగుతుందని, విజయవంతం చేయాలని కోరారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

సాక్షి, భీమవరం : విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. మంగళవారం పట్టణంలోని పొట్టిశ్రీరాములు(పీఎస్ఎమ్) మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా పేద విద్యార్థులు చదువులో వెనుకబడి పోకుండా ఉండేందుకు ప్రభుత్వం విద్యాదీవెన, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి అనేక పథకాలు అమలుచేస్తుందన్నారు.

వలస కూలీలతో కొరవడుతున్న ఉపాధి



ఉపాధి కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కూలీలతో స్థానికంగా ఉన్న వ్యవసాయ కూలీలకు ఉపాధి కొరవడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని ఆరుళ్ల గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులే ప్రధాన ఆధారమన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పాలకులు నీరుగారుస్తున్నారని, ఉపాధి కూలీలు ఈ చట్టం పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు. మారిశెట్టి సావిత్రి, దుర్గాప్రసాద్, పి.ఉమాదేవి, మధురబోయిన లక్ష్మి,మారిశెట్టి శ్రీను, ఎం.వరలక్ష్మి,న ఎం.సాయి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మందకృష్ణ మాదిగ సభను జయప్రదం చేయాలని మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి, తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ విస్సంపల్లి సిద్దు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక పట్టణంలో ఆర్ అండ్ బి బంగ్లాలో నిర్వహించారు. ఎమ్మార్పీస్ నియోజకవర్గ కన్వీనర్‌గా కంకట రవి కుమార్, కో కన్వీనర్ గాలింకి ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెద్దమూర్తి చిన్ని, పట్టణ అధ్యక్షుడిగా లంక రాజశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడిగా కొల్లి రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా దేవతల శివాజీ, ప్రధాన కార్యదర్శిగా పెద్దమూర్తి రాజేంద్ర, అధికారి ప్రతినిధి ఖండిలి రవి, కోశాధికారి కంకిపాటి ఆశోక్, యువసేన అధ్యక్షుడిగా చిగురుపల్లి నానిలు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోస్తా జిల్లాల ఇంచార్జ్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు, బొలుపో రత్నాజీ, చెప్పుల వాసు, ప్రభాకర్, జి.వాసు, పి.అచ్చారావు, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళలకు రక్షణ కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో మహిళలపై హింసకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరిగింది. పట్టణ కార్యదర్శి బంకుర యశోద, అధ్యక్షురాలు మీసాల పావనిలు పర్యవేక్షించారు. పూర్ణ మాట్లాడుతూ రోజు రోజుకు మహిళలపై హింస పెరుగుతున్నాయన్నారు. భక్తి పేరుతో పూర్ణానంద స్వామీజీ బాలికలపై అత్యాచారాలు చేయడం క్షమించరాని నేరమని తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీలను లైంగికంగా వేధించడం, పెట్రోల్ పోసి తగలపెట్టడం, రెండో పౌరులుగా చూడటం ఇవన్నీ మనువాద బీజేపీ నేర్పుతుందని మహిళలంతా దీనిని వ్యతిరేకించాలన్నారు. ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



వెంకట్రాయపురం పాఠశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

తణుకు టౌన్: ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ ఎస్.శ్రీనివాసరావు తల్లిదండ్రులను కోరారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఇంగ్లీష్ మీడియం బోధన వంటి పథకాల గురించి సమావేశంలో తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్ఎం ఎం ఏడుకొండలు, పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్, రీసోర్సు పర్సన్ ఎంఎస్ అనీలా కుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు దుర్గా దేవి, బీబీ, పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, పీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విస్తృతంగా గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే





ముద్దాపురం గ్రామంలో జగనన్న సురక్ష సేవలకు సంబంధించి లబ్ధిదారులను నమోదు చేస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు తదితరులు, ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారులు

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాలుగు గ్రామ సచివాలయాలలో మంగళవారం వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా నిర్వహించారు. కొమరవరం, కోనాల, వేల్పూరు 1వ గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు అవసరమైన సేవలను గుర్తించి నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని కోనాల, ముద్దాపురం, కొమరవరం, వేల్పూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సేవలకు సంబంధించిన అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

మండపాకలో అవగాహనా కార్యక్రమం

జగన్న సురక్ష కార్యక్రమంపై తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని 1వ గ్రామ సచివాలయంలో వలంటీర్లకు, గృహ సారథులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మండల సచివాలయ కన్వీనర్ కరిబండి రాజేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, మండల వాలంటీర్ల ఆపీసర్ శివారెడ్డి, సొసైటీ అధ్యక్షురాలు వై విజయామూర్తి, గ్రామ కార్యదర్శి యుగంధర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న సురక్ష సర్వే

ఇరగవరం:మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న సురక్ష సర్వేపై సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎవరికైౖ ధ్రువపత్రాలు అందక పోయిన, పథకాలు అందక పోయిన వారి వివరాలు సేకరించి వాటి పరిష్కారించడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరికీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నివాస స్థలాలను గ్రామ కంఠంగా మార్చాలని వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మంపాడు సర్పంచ్ సత్యనారాయణరాజు

అత్తిలి: గుమ్మంపాడు గ్రామంలో సర్వే నంబర్‌లు 50/1, 51/3 లలో ఇళ్లు నిర్మించుకున్న వారి భూములను గ్రామ కంఠంగా మార్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతికి, ఆగ్రామ సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు వినతిపత్రం అందజేశారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి వచ్చిన జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రంతో పాటు, గ్రామసభ తీర్మానం కాపీని ఇచ్చారు. ఈసర్వే భూమిలో 202 కుటుంబాలు ఏళ్ల తరబడి నివసిస్తున్నారని, ఇటీవల నిర్వహించిన రీసర్వేలో ఈ భూములు చెరువు పోరంబోకుగా చూపించడం వల్ల రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదని చెప్పారు. ఊర చెరువు, కుమ్మర చెరువు మినహాయించి మిగిలిన భూమిని గ్రామ కంఠంగా మార్చాలని కోరారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు అన్నారు. ప్రత్తిపాడు ట్రిబుల్ ఎఫ్ ఇండస్ట్రీలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ మంగళవారం రెండో రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ తరగతుల్లో ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల వల్ల సంభవించే విపత్తులయందు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదవశాత్తు నీటిలో పడితే స్పందించాల్సిన తీరు, రహదారుల్లో ఆయిల్ ట్యాంకర్లు, రసాయనాలను రవాణ చేసే వాహనాలు ప్రమాదానికి గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాల్గొన్న వారికి వెల్లడించారు. వివిధ పరిశ్రమలు, ఆసుపత్రులు, కళాశాలలు, పాఠశాలలకు చెందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పై అవగాహన



అత్తిలి మండలం కె సముద్రపుగట్టు సచివాలయంలో మాట్లాడుతున్న మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ



తాడేపల్లిగూడెం పట్టణంలో జగనన్న సురక్ష పథకంపై అవగాహన సమావేశంలో పాల్గొన్న నాయకులు

అత్తిలి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి, విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అత్తిలి-4, కె సముద్రపుగట్టు గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై జరిగిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు విని వారికి కావాల్సిన సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలకు అర్హత ఉండి పొందనివారి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ పెన్మెత్స రామరాజు, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, కె సముద్రపుగట్టు గ్రామపార్టీ అధ్యక్షుడు కముజు శ్రీనివాస్ ఎమ్మెల్వో వెలగల విజయభాస్కరరెడ్డి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జగనన్న సురక్షలో ప్రజలకు అవసరమైన సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని వన్ టౌన్, టూ టౌన్ సచివాలయాల కన్వీనర్లు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజులు పేర్కొన్నారు. జగనన్న సురక్ష అవగాహన సదస్సు పట్టణంలో మంగళవారం నిర్వహించారు. 10వ వార్డు, 12వ వార్డుల ఇంచార్జ్‌లు అడ్డాల నరసింహారావు, చామన సూర్యచంద్రరావులు పర్యవేక్షించారు. ఎంఎల్‌ఓ మారిశెట్టి రమణ మాట్లాడుతూ వివిధ రకాల సర్వీస్‌లకు సంబంధించి ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగా 8వ తేదీన జరుగు శిబిరంలో సర్టిఫికెట్స్ ఇస్తామని తెలిపారు. శిబిరంనకు వచ్చిన వారికి భోజన సదుపాయం ఉంటుందని వెల్లడించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడం, అక్కడికక్కడే పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోడే శ్రీనివాస్, మహిళా ఇంచార్జి కళ్యాణి, పెనుగొండ ఆంజనేయులు, కె.శ్రీనివాస్, ఎ.ధనకొండ, చల్లపల్లి నాగలక్ష్మి, ఎ.లక్ష్మి, ఉమాదేవి, ప్రసాద్, ధర్మరాజు, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.